క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు వెర్నిదుర్గానగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.29 లక్షలు కేటాయించింది. ఈ పనులకు ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన జరిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ వర్క్స్ ఏఈ వెంకటరావు, నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెదగదిలి కొండవాలులో..

12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఇక్కడ శివాలయం వీధిలో రూ 65.35 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న ఈ పనులను తొందరగా పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. త్వరలో యూజీడీ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, స్థానిక నాయకులు సత్యం, అప్పలరాజు, గోవింద్, సన్యాసిరావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ ఫెలోషిప్ పథకం తొలగింపు అన్యాయం




ఏయూలో మాట్లాడుతున్న గణేష్

మద్దిలపాలెం: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ జాతీయ ఫెలోషిప్ ఫర్ ఎస్సీ స్కీం తీసుకొచ్చి ఎస్సీ సామాజికవర్గంలోని ఉన్న పేద విద్యార్థులకు ఎంతో మేలు చేసింది, అయితే ఇప్పుడు బీజేపీ ఆ పథకాన్ని రద్దు చేయడంతో ఎస్సీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ బోనుల గణేష్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో ఆ పథకం ఉపయోగించుకుని 80 శాతం ఎస్సీలు ప్రొఫెసర్లుగా, ఇంజినీర్లుగా ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీలపై కక్ష కట్టి ఆ పథకం తొలిగించిందన్నారు. ఉన్నత చదువులు చదవాలంటే రూ.10 లక్షలకు పైగా ఖర్చు అవుతోందని, అంత డబ్బు పెట్టలేక ఎస్సీ విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. వెంటనే జాతీయ ఫెలోషిప్ పథకాన్ని పునఃప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ఎంవీపీకాలనీ: కారు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. నాగల్ల జ్యోతి, పోలయ్య దంపతులు శివాజీపాలెం సిక్స్ ట్యాప్స్ జంక్షన్ వద్ద నివసిస్తున్నారు. పోలయ్య ఆటో నడుపుతుంటాడు. గత నెల 30న పోలయ్య తన భార్యకు హనుమంతవాక వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు తెల్లవారుజామున 3.30 గంటలకు పోలయ్య స్నేహితులు నర్సింగ్, గోపాల్, దుర్గా అతడి భార్య జ్యోతికి ఫోన్ చేసి మద్యం మత్తులో శివాజీపాలెం తాండ్ర పాపారాయుడు ఫంక్షన్ హాల్ సమీపంలో ఆటో నడుపుతుండగా పోలయ్య ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. కేజీహెచ్‌కు తరలించినట్లు చెప్పడంతో ఆమె అక్కడికి వెళ్లి పరిశీలించింది. గాయాలపై అనుమానంతో సంఘటన స్థలం దగ్గరలోని సీసీ టీవీ ఫుటేజ్‌ను బంధువులతో కలిసి ఆమె పరిశీలించగా.. గోపాల్, దుర్గాలు పోలయ్యను ఆటోలో నుంచి బయటకు తీసి రోడ్డు సమీపంలో వదిలి వెళ్లినట్లు, అటుగా ఓ కారు పోలయ్య మీద నుంచి వేగంగా వెళ్లినట్లు కనిపించింది. ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త తొలగింపు



పొక్లెయిన్‌తో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులో పేరుకుపోయిన చెత్తను బుధవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. రోడ్డు మీద, కాలువల్లో, ఫుట్‌పాత్‌లపై చెత్త పెద్ద మొత్తంలో పేరుకుపోవడంతో స్థానికులు కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి సురేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడి వార్డులోని చెత్తను పొక్లెయిన్‌తో తొలగింపజేశారు.

ధ్రువపత్రాల కోసం పాట్లు

- జోన్–3 పరిధి సచివాలయాల్లో సక్రమంగా పనిచేయని పరికరాలు
- ప్రింటర్ల మొరాయింపుతో జారీ కాని సర్టిఫికెట్లు
- ప్రజల ఇబ్బందులను పట్టించుకోని అధికారులు



సచివాలయంలో మూలకు చేరిన ప్రింటర్లు



ఇసుకతోట రజక వీధి సచివాలయం

మద్దిలపాలెం: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని పలు వార్డు సచివాలయాల్లో కొన్ని నెలలుగా ప్రింటర్లు, మానిటర్లు పనిచేయక పడకేశాయి. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలు అవి అందక ఇబ్బంది పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు నిర్వీర్యమవుతున్నాయని జనం మండిపడుతున్నారు.

మీ సేవ, ఇంటర్‌నెట్ సెంటర్లే గతి..!

వాస్తవానికి సచివాలయాల్లో కుల, నివాస, ఆదాయ, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ప్రింట్లు తీసి ఇవ్వాల్సి ఉంటుంది. పలు సచివాలయాల్లో ప్రింటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది సర్టిఫికెట్ల వెనుక స్టాంప్ వేసి, సంతకాలు చేసి బయట ఇంటర్‌నెట్, మీ సేవ కేంద్రాలకు వెళ్లి ప్రింట్ తీసుకోండంటూ సర్టిఫికెట్లను వాట్సాప్ రూపంలో పంపుతున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఈ సమస్యపై అడుగుతుంటే కొందరు సచివాలయ సిబ్బంది వాగ్వాదాలకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు పలు సచివాలయాల్లో జరిగాయి. గతంలో సచివాలయ సిబ్బంది బదిలీలు ఉండటంతో జూలై వరకు వేచి చూసిన ప్రజలు.. ఇప్పుడు కొత్త సిబ్బంది విధుల్లోకి చేరినా.. పాత కంప్యూటర్లు, పనికిరాని ప్రింటర్లతో తంటాలు పడుతుండటంతో విసుగు చెందుతున్నారు. సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయని దుస్థితి నెలకొన్నా.. జీవీఎంసీ జోన్–3 కార్యాలయ సిబ్బంది స్పందించక పోవడంతో పరికరాల మరమ్మతులకు చేతి చమురు వదులుతోందని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

సర్టిఫికెట్లు అందక ఆవేదన

ఒకవైపు విద్యా, ఉద్యోగ సంబంధిత కౌన్సెలింగ్‌లు జరుగుతున్న సమయంలో కుల, నివాస, ఆదాయ తదితర ధ్రువపత్రాలు సచివాలయాల్లో అందకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత వాటిని కౌన్సెలింగ్‌లో చూపించి దరఖాస్తు చేసినా..



నిరుపయోగంగా కంప్యూటర్ పరికరాలు

పత్రాలు పొందలేక పోతున్నామని, ఓ లెటర్ రాస్తే కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చి సీటును అలాట్‌మెంట్ చేస్తున్నారని చెబుతున్నారు. ఆయా సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోవడంతో ఇంటర్‌నెట్ సెంటర్లను ఆశ్రయించాల్సిన రీతిలో ప్రజాప్రతినిధులు పాలన చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సచివాలయాల్లో పనిచేయని పరికరాలకు మరమ్మతులు చేయించి, సకాలంలో ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని జోన్–3 ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



సచివాలయాల్లో దరఖాస్తు చేసిన కుల, నివాస, ఆదాయ ధ్రువ పత్రాల కోసం వెళ్తే ప్రింటర్లు పనిచేయడం లేదని సిబ్బంది సమాధానం చెబుతున్నారు. ప్రింట్ కావాలని అడిగితే మీ సేవ, ఇంటర్‌నెట్ సెంటర్లకు వెళ్లి తీసుకోవాలంటూ ప్రింట్ పేపర్ వెనుక సంతకం చేసి ఖాళీ సర్టిఫికెట్ ఇస్తున్నారు. ఈ సమస్యను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా. స్పందన లేదు.

– కనకల కృష్ణ, భానునగర్, మద్దిలపాలెం

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత అన్నపూర్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పాత డెయిరీ ఫామ్‌కి చెందిన జి.అన్నపూర్ణ అనే దాత రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకి సింహగిరిపై బుధవారం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనంని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సమత డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం కృత్రిమ మేధస్సు(ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అస్యూర్డ్ అసిస్ట్ ఫౌండర్ గౌతమ్ ఆదిత్యన్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రభావితం చేస్తున్న పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. డిజిటల్ మార్కెటింగ్, ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్‌లు, ఇతర డిజిటల్ మీడియా టెక్నాలజీ ప్లాట్‌ఫామ్స్‌లో వచ్చిన మార్పులను, వాటి ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం.. ప్రైవేట్ జపం



సుందర్‌నగర్‌లో వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ: మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడానికి కూటమి ప్రభుత్వం చూస్తోందని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు తెలిపారు. జీవీఎంసీ పదో వార్డులో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సుందర్‌నగర్‌లో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తిరోగమన పాలన గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు సైతం అందుబాటులో ఉండే విధంగా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు వాటిని నిలిపేసి ప్రైవేట్‌కు అప్పగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం పాలనను గమనించాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త సంకురబోతు రమణను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొండా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఇట్ల వరలక్ష్మి, పతివాడ వెంకటలక్ష్మి, కంటుబోతు తులసి, రవీంద్ర, కన్నబాబు, కృష్ణ, చలం, ఆనంద్, శారద, శ్రీను, భగవత్, సత్యనారాయణ, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



శివాజీపాలెంలో పందిరి రాట వేస్తున్న ముువ్వల సురేష్, సంఘ సభ్యులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలో విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం దసరా ఉత్సవాలకు పందిరి రాట వేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముువ్వల సురేష్ పాల్గొని రాటను ప్రతిష్ఠించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ స్నాతకోత్సవ నిర్వహణపై వీసీ సమీక్ష



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని సమష్టిగా నిర్వహించాలని ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ సూచించారు. స్నాతకోత్సవ నిర్వహణపై వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిసెప్షన్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, సైటేషన్ కమిటీలు తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. స్నాతకోత్సవ మందిరానికి అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. ఈ సంవత్సరం స్నాతకోత్సవం నిర్వహించే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ వంటివి సిద్ధం చేయాలని పరీక్షల విభాగానికి ఆదేశించారు. స్నాతకోత్సవంలో విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం హాజరవుతారని, దానిని దృష్టిలో పెట్టుకుని సిటింగ్ ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్నాతకోత్సవ మందిరంలోకి ప్రవేశం, బయటికి వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. పనులను త్వరతగతిన పూర్తి చేస్తూ ప్రగతిని ఎప్పటికప్పుడు కమిటీ చైర్మన్‌కు తెలియజేయాలని సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎ.సి. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు, టీసీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హలో డ్రైవర్ అన్న.. చలో కలెక్టరేట్



మద్దిలపాలెం ఆటో స్టాండ్ వద్ద బ్యానర్ ప్రదర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, డ్రైవర్లు

మద్దిలపాలెం: గురువారం ఉదయం 9 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం, అక్కడి నుండి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే ఆటో ర్యాలీలో డ్రైవర్లంతా పాల్గొనాలని ఆటో ఫెడరేషన్ ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మధురెడ్డి కోరారు. జీవీఎంసీ 16వ వార్డు కృష్ణా కాలేజీ రోడ్డులో గల శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ వద్ద బుధవారం ఆయన ర్యాలీ బ్యానర్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉచిత బస్ పథకంతో ఆటో డ్రైవర్లు ఆదాయం కోల్పోయారన్నారు. తక్షణమే ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ఎన్నికల ముందు ఆటో, మోటార్ కార్మికులకు హామీ ఇచ్చిన విధంగా వాహన మిత్ర కింద రూ. 15 వేలు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, రాపిడ్, ఆన్‌లైన్ యాప్‌లు, టూవీలర్ల బైకుల వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. వాటిని వెంటనే తొలగించాలని కోరారు. డ్రైవర్లకు ప్రమాదకరంగా ఉన్న 21,31 జీవోలను రద్దు చేయాలని అన్నారు. ఆటో డ్రైవర్లు ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్న ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సంక్షేమ బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టాండ్ డ్రైవర్లు కెల్లా రమణ, మురళి, శ్రీను, శంకర్ తదితరులు పాల్గొన్నారు

నమ్మండి.. ఇది పబ్లిక్ పార్కే..!





జోడుగుళ్లపాలెం జీవీఎంసీ పబ్లిక్ పార్క్ మధ్యలో పచ్చిక మేస్తూ సంచరిస్తున్న గేదెలు

- పశువుల శాలలా జోడుగుళ్లపాలెం జీవీఎంసీ పార్క్
- పశు సంచారంతో పాడవుతున్న పార్కు పరిసరాలు
- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, చిన్నారులు



పబ్లిక్ పార్క్ ప్రవేశ ద్వారం వద్ద మెట్లపై పశువుల పేడ



పార్కు లోపల పశువుల పేడతో అధ్వానంగా పాత్‌వే

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 పరిధిలోని పార్కుల నిర్వహణ తూతూ మంత్రంగా మారింది. ప్రజాధనంతో నిర్మించిన పార్కుల నిర్వహణను అధికారులు పక్కన పెట్టేయడంతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ప్రజలు సేదదీరాల్సిన పార్కుల్లో పశువులు సంచరిస్తున్నాయి. జీవీఎంసీ 9వ వార్డులోని పబ్లిక్ పార్కే దీనికి ఉదాహరణ.. జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డు పక్కన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పబ్లిక్ పార్కు నిర్మాణం ఏడాది కిందట పూర్తయింది. సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన ఈ పార్కు బీచ్‌ను ఆనుకుని స్థానికులకు అందుబాటులో ఉంది. విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం ప్రాంతాల నుంచి పిల్లలు, వృద్ధులు సాయంత్రం వేళల్లో ఇక్కడ గడుపుతున్నారు. పార్కులో అమర్చిన ఆట పరికరాలతో పిల్లలు ఆడుకుంటున్నారు. ఆహ్లాదకరమై వాతావరణం కావడంతో వృద్ధులు ఎక్కువ సమయం సేదదీరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ పార్కు నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీంతో పార్కు లోపలకు పశువులు ప్రవేశిస్తున్నాయి. ఇక్కడ పచ్చని లేన్లపై పచ్చిక మేస్తూ పేడ, మూత్రంతో అస్తవ్యస్తం చేస్తున్నాయి. అక్కడికి వెళ్లిన పిల్లలు, పెద్దల మధ్యనే అవి తిరుగుతున్నాయి. ప్రవేశ ద్వారం నుంచి పాత్‌వేలు, పచ్చని లేన్లు పేడతో కంపుకొడుతూ అస్తవ్యస్తంగా మరాయి. ఈ పార్కు నిర్వహణను స్థానిక సంఘాలకు అప్పగిస్తే పరిశుభ్రంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. అలాంటప్పుడే ఇది పబ్లిక్ పార్కు పేరుతో ప్రజలకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. దీని నిర్వహణ విషయంలో స్థానికులకు అప్పగించాలని ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్‌ను కోరినట్లు వార్డ్ కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి తెలిపారు. బీచ్‌ను ఆనుకొని ఉన్న ఈ పార్కు పబ్లిక్‌కు పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు.

ఏయూలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా త్వరలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్ వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్సెస్ 2025–26 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ ఈ నెల 15న ఆర్చరీ పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 25న యోగా పురుషులు, మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ కాలేజ్ క్రీడలు మహిళలు, పురుషుల విభాగంలో జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కోకో, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఏయూ అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్ కాలేజ్ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య పల్లవి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాసుదేవరాజు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్.బి.కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణపతి విందు.. భలే పసందు

- 45 రకాల పదార్థాలతో అన్నసమారాధన
- కొబ్బరితోట వాసులకు విందుభోజనం
- బహుమతిగా వెండి వినాయక చిత్రాలు




వెండి వినాయకుడి చిత్రం



భోజనాలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: వినాయక భోజనంబు.. భలే పసందు అంటూ కొబ్బరితోట వాసులు లొట్టలేసుకుంటూ ఆరగించారు. కొబ్బరితోట ఎస్వీపీ నగర్‌లో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం సుమారు 2500 మందికి అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 40కి పైగా పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఒక వెండి వినాయక ఫొటో కూడా బహుమతిగా అందజేశారు. ఒక్కొక్కరికి వెలకమ్ డ్రింక్, ఒక లస్సీ, 2 లీటర్ల డ్రింకు బాటిల్, సోడా బాటిల్, వాటర్ బాటిల్, మిల్క్ మరీడా, ఫలూడా, 10 రకాల స్వీట్లు, మూడు ఫ్రై కర్రీలు, 4 గుజ్జు కర్రీలు, బిర్యానీ, పులిహోర, వైట్ రైస్, సాంబారు, పెరుగుచారు, కుల్ఫీ, కోన్ ఐస్ క్రీమ్, హల్వా, జున్ను, సత్యనారాయణ ప్రసాదంతో కలిపి విందు భోజనంలా వడ్డించారు. తిన్నవారంతా ఆహా ఏమి విందు అంటూ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇజ్రాయెల్‌తో ఒప్పందాలను రద్దు చేసుకోవాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

బీచ్‌రోడ్డు: గాజాలో మారణకాండ కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌తో భారత ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని పౌర ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ మంత్రి ఈ నెల 8,9,10 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామ్మూర్తి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ సుధ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గాజాలో శాశ్వత కాల్పుల విరమణ పాటించాలని, మారణకాండకు కారకుడైన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, ఇతర అధికారులను విచారించి శిక్షించాలన్నారు. ఆకలితో ఉన్న గాజా ప్రజలకి భారత ప్రభుత్వం వెంటనే ఆహార దినుసులు, మందులు అందజేయడంతో వారు కోరిన సహాయం చేయాలన్నారు. పలు సంఘాల ప్రతినిధులు నాగభూషణం, వై. నూకరాజు, రాంబాబు, బేగం, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.